

7న ‘ఘంటసాల గాన వినోదం’

ఏలూరు: ఉగాదిని పురస్కరించుకుని ఏప్రిల్ ఏడో తేదీన ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో ‘ఘంటసాల గాన వినోదం’ పేరుతో సంగీత స్వరాలాపన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం.సుభాని తెలిపారు. ఏలూరులోని సంస్థ కార్యాలయంలో సోమవారం జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సంస్థ ప్రతినిధి లంకా వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి వై.అర్జునరావు, సహాయ కార్యదర్శి శ్రీవల్లి, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, నంది అవార్డు గ్రహీత మహ్మద్ ఖాజావలీ, స్వరపీఠం సభ్యులు రాజేష్, మీనన్ ఘంటసాల గాన వినోదం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ ‘తేట తేట తెలుగులా ఘంటసాల గాన విభావరి’గా ఘంటసాల ఆలపించిన పాటలను కళాకారులు ఆలపిస్తారన్నారు. తెలుగుభాషా పరిరక్షణ కోసం ఘంటసాల ఆలపించిన పాటలు తెలుగు విలువను ఎంతో పెంచాయన్నారు. తెలుగు పాటల మాధుర్యాన్ని భావితరానికి అందించాలనే లక్ష్యంతో ఘంటసాల గాన వినోదం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తామని వివరించారు.

‘రెబల్స్’ రచ్చ..!

- అసంతృప్తులతో వైసిపి, టిడిపిలో గందరగోళం
- ఉండి, నూజివీడు, నరసాపురంల్లో టిడిపికి తప్పని తలనొప్పి
- చింతలపూడి వైసిపి ఎంఎల్ఎ కాంగ్రెస్‌లో చేరి పోటీకి రెడీ
- ఏ పార్టీ అభ్యర్థికి నష్టమో అంటూ రకరకాల లెక్కలు
- వెనక్కి తగ్గుతారా.. పోటీకి సిద్ధమా అనేది సందిగ్ధమే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, వైసిపిలో అసంతృప్తులతో రాజకీయం మరింత వేడెక్కుతోంది. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా ప్రధానంగా నాలుగుచోట్ల ఆయా పార్టీల నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన నాయకులు రెబల్స్‌గా, ఇతర పార్టీల నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రధాన పార్టీ అభ్యర్థులకు దీటుగా నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి అభ్యర్థుల్లో ఎవరికి నష్టం జరుగుతుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఉండి నియోజకవర్గ టిక్కెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. నియోజవకర్గమంతా తిరుగుతూ ప్రచారం సైతం నిర్వహిస్తున్నారు. ఆయన్ని బుజ్జగించేందుకు టిడిపి ఎన్ని ప్రయత్నాలు చేసినా శివరామరాజు వెనక్కి తగ్గలేదు. దీంతో ఉండి నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. శివరామరాజు బరిలో ఉండటంతో టిడిపికి నష్టమా, వైసిపికి నష్టమా అనే అంచనాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసినప్పటికీ విత్‌డ్రాల సమయం వచ్చేసరికి ఆయన్ని ఒప్పించి పక్కకు తప్పించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారమూ సాగుతోంది. అప్పటి వరకూ టిడిపికి తలనొప్పి తప్పదని చెప్పొచ్చు. నరసాపురం నియోజకవర్గ టిక్కెట్‌కు సంబంధించి ఆది నుంచి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పేరు ప్రముఖంగానే విన్పించింది. టిడిపి నుంచి మాధవనాయుడు, పొత్తూరి రామరాజు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు టిక్కెట్ ఆశించారు. వైసిపిని వదిలి జనసేనలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు నరసాపురం టిక్కెట్ తనదే అంటూ చెబుతూ వచ్చారు. చివరికి జనసేన అభ్యర్థిగా నాయకర్ పేరు ఖరారైంది. దీంతో టిడిపి అధిష్టానం రామరాజు, రామ్మోహననాయుడుతో మాట్లాడి ఇరువురి నుంచి సమస్య లేకుండా సద్దుమణిగేలా చేసింది. అయితే మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడుని మాత్రం పిలిచి మాట్లాడలేదని తెలిసింది. దీంతో ఎన్నికల బరిలో ఉండేందుకు మాధవనాయుడు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్తు ప్రకటిస్తానంటూ ఇటీవల మీడియా సమావేశంలో మాధవనాయుడు ప్రకటించిన సంగతి తెలిసిందే. మాధవనాయుడు ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగితే ఏ పార్టీకి నష్టం వాటిల్లుతుందోననే చర్చతోపాటు టిక్కెట్ రాకపోవడంతో అలకబూనిన కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనకు మద్దతుగా నిలుస్తారా, రెబల్‌గా మారి వ్యతిరేకంగా పని చేస్తారా అనేది తేలాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో చివరి నిముషంలో వైసిపిలో చేరిన కొత్తపల్లి అప్పటి జనసేన అభ్యర్థి నాయకర్‌కు నష్టం చేకూర్చారనే చర్చ అప్పట్లో సాగింది. ఈసారి ఏం జరుగుతుందో వేచిచూడాలి.

‘ముద్దరబోయిన’ తిరుగుబాటు జెండా

టిడిపి నుంచి నూజివీడు టిక్కెట్ ఆశించిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు టిడిపి అధిష్టానం ఝలక్ ఇచ్చింది. స్థానికేతరుడు, వైసిపి నుంచి వచ్చిన కొలుసు పార్థసారథికి టిక్కెట్ ఇచ్చింది. దీంతో ముద్దరబోయిన తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు ధీటుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా భారీగా ఖర్చు పెట్టేందుకు సైతం ముద్దరబోయిన సిద్ధమైనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో పోటీ చేసి ఓటమి పాలయ్యారనే సానుభూతి ముద్దరబోయినకు ఉంది. నూజివీడు బరిలో ఈయన తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. టిడిపికి నష్టం అత్యధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నప్పటికీ వైసిపి ఓట్లను చీల్చే అవకాశం ఉందని లెక్క కడుతున్నారు. ఈయన ఎన్నికల బరిలో కడవరకూ నిలబడతారో, లేదో వేచి చూడాల్సి ఉంది.

వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ కాంగ్రెస్ నుంచి పోటీ

వైసిపి చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఏ ఉన్నమట్ల ఎలిజా మరోసారి టిక్కెట్ ఆశించినా దక్కలేదు. దీంతో ఆయన వైసిపిని వీడి కాంగ్రెస్‌లో చేరారు. చింతలపూడి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎంఎల్ఏగా ఉన్న ఆయన తనకంటూ సొంత బలగాన్ని తయారు చేసుకున్నారు. దీంతో వైసిపికి ఇబ్బందికరమేననే ప్రచారం సాగుతోంది. ఆయా స్థానాల్లో ఏం జరుగుతుందో ఎన్నికల బరిలో చూడాల్సి ఉంది.

రాజుల పోరు.. రసవత్తరం..!



- ‘ఉండి’లో మారుతున్న రాజకీయ సమీకరణలు
- టిడిపి, వైసిపి అభ్యర్థులుగా మంతెన రామరాజు, పివిఎల్
- స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ శివరామరాజు సై
- ‘ఉండి’పై కన్నేసిన నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు
- టిడిపి నుంచి పోటీలో ఉంటారని ప్రచారం
- ఆసక్తికరంగా ‘ఉండి’ రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఉద్దండుల ‘ఉండి’లో రాజుల పోరు రసవత్తరంగా మారింది. మారుతున్న రాజకీయ సమీకరణలతో టిడిపికి బలమైన కోటలో రాజకీయం వేడెక్కింది. టిడిపి, వైసిపి అభ్యర్థులతోపాటు టిడిపి రెబల్ అభ్యర్థి ఇప్పటికే బరిలో ఉండనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మరో నేత టిడిపి టిక్కెట్ కోసం యత్నిస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అందరి చూపు ఉండి నియోజకవర్గంపై పడింది. అయితే ఈ రసవత్తర పోరులో నిలిచేది ఎవరనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.

ఉండి నియోజకవర్గం అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. రాష్ట్ర రాజకీయాల్లో సైతం ఉండి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇది ఆది నుంచి టిడిపికి బలమైన కోటగా ఉండటంతోపాటు క్షత్రియులకు పట్టున్న నియోజకవర్గంగా పేరొందింది. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటి వరకూ 16 సార్లు ఇక్కడ ఎన్నికలు జరిగాయి. 1983లో టిడిపి ఆవిర్భావం నుంచి 1999 వరకు కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయి రాజు) ఐదుసార్లు ఎంఎల్ఏగా గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు టిడిపి గెలుపొందింది. ఇక్కడ గెలిచిన ఎంఎల్ఏల్లో ఎనిమిది మంది క్షత్రియులే కావడం విశేషం. అటు టిడిపికి.. ఇటు క్షత్రియులకు అడ్డాగా ఉన్న ఈ నియోజకవర్గంపై ప్రస్తుతం అందరి దృష్టి పడింది. టిడిపి నుంచి కూటమి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఏ మంతెన రామరాజు, వైసిపి నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, (పివిఎల్), టిడిపి రెబల్ అభ్యర్థిగా వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఎన్నికల బరిలో తలపడుతున్నారు. 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి శివరామరాజు రెండుసార్లు ఎంఎల్ఏగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో శివరామరాజు టిడిపి అధిష్టానం నిర్ణయం ప్రకారం నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. శివరామరాజుకు సమీప బంధువైన మంతెన రామరాజుకు ఉండి టిక్కెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో శివరామరాజు ఓటమి పాలవగా, రామరాజు గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఏ మంతెన రామరాజుకు మరో అవకాశం కల్పించింది. ఈ టిక్కెట్‌ను ఆశించిన మాజీ ఎంఎల్ఏ శివరామరాజు భంగపాటుకు గురయ్యారు. టిడిపి అధిష్టానం ఘోరంగా అవమానించిందని భావించిన శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తొలిసారి పోటీ చేసి 20 శాతం ఓట్ల వ్యత్యాసంతో ఓటమి చవిచూసింది. టిడిపి, బిజెపి, జనసేన పొత్తులో భాగంగా ఇక్కడ టిడిపి గెలిచింది. అయితే ఈ క్రమంలో వైసిపి నియోజకవర్గ బాధ్యతలు పివిఎల్ చేపట్టి పార్టీని నిలబెట్టారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి నుంచి పివిఎల్ నరసింహారాజు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో ఉండి ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది.

‘ఉండి’పై ఎంపీ రఘురామకృష్ణంరాజు చూపు

నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఉండి నుంచి ఎంఎల్ఏ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. అయితే ఆయన టిడిపి తరపున బరిలోకి దిగుతారని ఒక ప్రచారం, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ప్రచారం మరోవైపు సాగుతోంది. వైసిపి నుంచి 2019లో ఎంపీగా గెలిచిన కొద్దిరోజులకే రఘురామకృష్ణంరాజు ఆ పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన బిజెపితో సన్నిహితంగా ఉంటూ టిడిపి, జనసేనకు అనుకూలంగా మాట్లాడుతూ వైసిపిపైనా, ప్రధానంగా సిఎం జగన్‌పైనే విమర్శలు ఎక్కుపెట్టేవారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన ‘జెండా’ సభలోనూ తాను కూటమిని నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్వయంగా ప్రకటించేశారు. అయితే రఘురామకృష్ణంరాజుకు ఝలక్ ఇస్తూ బిజెపి తన అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఎంపిక చేసింది. దీంతో రఘురామకృష్ణంరాజు తాను వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీలో ఉంటానని తాజాగా ప్రకటించడంతో ఉండి అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో ఉండి రాజకీయం రోజుకో రీతిన మలుపులు తిరుగుతోంది.

స్ఫూర్తిదాయకులు గుంటూరు బాపనయ్య

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిరంతర స్ఫూర్తిదాయకులు గుంటూరు బాపనయ్య అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. చల్లపల్లి జమిందారు వ్యతిరేక పోరాట నాయకుడు గుంటూరు బాపనయ్య 46వ వర్ధంతి సభ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నే వెంకటేశ్వరరావు భవనంలో ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు తొలుత బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య మూడుసార్లు ఎంఎల్ఏగా, ఒకసారి ఎంఎల్‌సిగా పని చేశారని తెలిపారు. ప్రజలు తనకు కట్టబెట్టిన పదవిని వారి సంక్షేమానికి, ప్రజాసేవకు మాత్రమే ఉపయోగించి స్ఫూర్తిగా నిలిచారన్నారు. 1942 నుంచి చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా మంగళాపురంలో ముదిరాజులకే బంజరు చెందేటట్లు సాగిన పోరాటానికి చండ్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణరావులతోపాటు నాయకత్వం వహించారని తెలిపారు. 1946లో 17 వేల ఎకరాల చల్లపల్లి జమిందారీ భూముల్లో ‘గట్ల ఉద్యమానికి’ కృషి చేశారని, 1947లో రాష్ట్రవ్యాప్తంగా పాలేర్ల జీతాల పెంపుదలకూ, పనిగంటల తగ్గింపునకూ జరిగిన పోరాటానికీ నాయకత్వం వహించారని చెప్పారు. 1948లో జమీందారీ విధానం రద్దు, దున్నేవారికే భూమి కోసం ఉవ్వెత్తున సాగిన పోరాటాల సందర్భంగా ప్రభుత్వం బాపనయ్యను అరెస్టు చేసి రాజమండ్రి, కడలూరు జైళ్లలో 1951 వరకూ నిర్బంధించిందన్నారు. తన శత్రువుకు సైతం సాయం చేసే సహృదయుడైన బాపనయ్య సిద్ధాంతం విషయంలో ఏనాడూ రాజీ పడలేదన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడగా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మహంకాళిరావు, జిల్లా నాయకులు సాయికృష్ణ, సిఐటియు నాయకులు పి.కిషోర్, జె.గోపీ, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి తదితరులు పాల్గొన్నారు.



బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

తనిఖీల్లో రూ.82 వేల నగదు స్వాధీనం

ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజవలి

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ వెల్లడించారు. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా గణపవరం మండలం సరిపల్లి గ్రామం వద్ద రూ.82 వేల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నిర్వహించిన తనిఖీల్లో రూ.82 వేల నగదు గుర్తించి స్వాధీనపర్చుకున్నారన్నారు. నగదు తీసుకెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

కామవరపుకోట: స్థానికంగా ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ తనిఖీలను పర్యవేక్షించిన జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర మాట్లాడుతూ రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే దానికి తగిన పత్రాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఎస్ఎస్ టీమ్ అధికారి ఎమ్‌డి.మొహిద్దీన్, పోలీస్ కానిస్టేబుళ్ల కె.రమేష్, అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై నిరంతర నిఘా

కంట్రోల్ రూమ్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాస్వామ్యం మనుగడకు ఎన్నికలే మూలాధారం. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కృషి చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు, వారి వినతుల స్వీకరణకు వివిధ వ్యవస్థలను అందుబాటులో ఉంచారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకొనేందుకు ఇవన్నీ దోహదపడతాయి. అత్యంత కీలకమైన ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేసేందుకు, ఎన్నికల ప్రక్రియపై నిరంతర నిఘా కోసం, వివిధ విభాగాలతో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఏర్పాటైన ఈ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌లో కంప్లయింట్ సెల్ ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది. దీని ఆధ్వర్యంలో సి-విజిల్, కాల్ సెంటర్, 1950 హెల్ప్‌లైన్ తదితర విభాగాలను ఏర్పాటు చేశారు. ఆయా విభాగాలకు వచ్చే ఫిర్యాదులను, వినతులను విశ్లేషించి, సంబంధిత అధికారుల ద్వారా వాటిపై తక్షణమే చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి పర్యవేక్షిస్తున్నారు. సి విజిల్ కంప్లయింట్ సెల్‌కు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపవరం, సోషల్ మీడియాకు ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ పర్యవేక్షణాధికారులుగా వ్యవహరిస్తున్నారు.

అక్రమాలపై ఉక్కుపాదం మోపే సి విజిల్ యాప్ :ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు, అక్రమాలపై వీలైనంత వేగంగా, సాక్షాధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు ప్రజలకిచ్చిన గొప్ప అవకాశం సి-విజిల్ మొబైల్ యాప్. ఇటీవలే అందుబాటులో వచ్చిన ఈ యాప్‌ను పౌరులు ఎవరైనా గూగుల్ ప్లే స్టోర్ నుంచి తమ మొబైల్‌కు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదైనా అంశంపై ఫిర్యాదు చేయడానికి ఈ యాప్‌ను తెరిచి, విండోలో సంబంధిత అంశానికి సంబంధించిన ఫొటో లేదా 2 నిమిషాల వీడియో తీసి లైవ్‌గా అప్‌లోడ్ చేయాలి. దాని గురించి కింద కొన్ని వాఖ్యాల్లో వివరించవచ్చు. ఆ అంశాన్ని స్క్వాడ్ పరిశీలించి, కేవలం 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటారు.

ఓటర్ హెల్ప్ లైన్ 1950: ఓటర్లకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఇది. ఈ టోల్‌ఫ్రీ నంబరుకు జిల్లాకు చెందిన ఓటర్లు నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు. ఈ కాల్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుంది. ఇక్కడకు వచ్చిన ఫోన్లను రికార్డు చేసి, చర్యల కోసం సంబంధించిన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు.

24 గంటల కాల్ సెంటర్: ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటైంది. ఫోన్ నెంబర్ 18002331077కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇది కూడా 24 గంటలూ పనిచేస్తుంది. ఇక్కడికి వచ్చే ఫిర్యాదులను, వినతులను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఎన్‌జిఎస్ పోర్టల్: నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ వెబ్ సైట్‌లో ఓటర్లు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఓటర్ హెల్ప్‌లైన్, ఓటర్ పోర్టల్, ఓటర్ మిత్రాలో కూడా ఫిర్యాదు చేయవచ్చు, తమ వినతులను అందజేయవచ్చు. ఆయా వెబ్ సైట్లకు లేదా హెల్ప్ లైన్లకు వచ్చిన ఫిర్యాదులు, వినతులను పరిశీలించి సంబంధిత విభాగాలకు, ఆయా శాఖల అధికారులకు పంపించడం జరుగుతుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల అధికారికి కూడా నేరుగా ఫిర్యాదు చేసే అవకాశాన్ని కూడా కల్పించారు.

సాక్ష్యం యాప్: ఇది ప్రత్యేకంగా వికలాంగుల కోసం రూపొందించింది. సదరం ప్రకారం 40 శాతం వికలాంగత్వం దాటిన వికలాంగులు ఇంటినుంచే వివిధ సేవలను పొందే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. దీనికోసం సాక్ష్యం యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

మీడియా మోనటరింగ్ సెల్: పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి వచ్చే వార్తలు, వ్యతిరేక వార్తలు, ప్రకటనలను ఈ విభాగం నిరంతరం పరిశీలిస్తుంది. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే వార్తలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనధికార ప్రకటనలు, అనుమతి లేని ప్రచార వార్తలు, పెయిడ్ న్యూస్‌ను సేకరించి చర్యల నిమిత్తం సంబంధిత ఆర్‌ఒలకు పంపిస్తారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించే పోస్టింగులపై చర్యలు తీసుకుంటారు.

రిపోర్ట్స్ మోనటరింగ్ సెల్: వివిధ విభాగాలకు వచ్చే ఫిర్యాదులు, జిల్లాలో నమోదు చేసిన కేసులు, వాటిపై తీసుకున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిరోజూ పంపించడం జరుగుతుంది. అన్ని విభాగాలనుంచి రిపోర్ట్స్ సేకరించి, తుది నివేదికను తయారు చేస్తారు. ఈ రిపోర్ట్స్ మోనటరింగ్ విభాగాన్ని జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ పరిశీలన నోడల్ అధికారులు సైతం ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు.

వికలాంగులకు సేవ చేయడం అభినందనీయం

ఎపి ప్లానింగ్‌బోర్డు వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా వృద్ధులకు, వికలాంగులకు పలు రకాలైన సేవలు అందజేయడం ఎంతో అభినందనీయమని ఎపి ప్లానింగ్‌బోర్డు వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. మండల పరిధిలోని సింగన్నగూడెం క్రాస్‌రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్, రెసిడెన్స్ వేల్ఫేర్ అసోషియేషన్ బ్రాంచి కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు పంతగాని నానయ్య అధ్యక్షత వహించగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎస్.కృష్ణ, పి.ప్రసాద్, పి.కనకదుర్గ, ఉదయ్‌కిరణ్, భాస్కరరావు, రమేష్, డెన్నీ, చైతన్య కిశోర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మల్లాది విష్ణు

చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది 24 గంటలూ పని చేయాలి

ఎన్నికల అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ల వద్ద సిబ్బంది 24 గంటలు పనిచేయాలని పోలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎమ్.సూర్యతేజ ఆదేశించారు. సోమవారం జీలుగుమిల్లి రాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్ వద్ద జరుగుతున్న వాహన తనిఖీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలలో నగదు, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలను సరిహద్దులు దాటకుండా 24 గంటల పాటు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు వీలుగా చీరలు, గిఫ్ట్ వంటివి వాహనాలలో తరలించే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సూర్యతేజ

‘సమస్యలపై పూర్తి అవగాహన ఉంది’

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్‌కు తాను కొత్తే అయినా నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఉమ్మడి టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. సోమవారం మహేష్ ఏలూరు పార్లమెంట్ స్థాయి టిడిపి, బిజెపి, జనసేన నాయకుల, కార్యకర్తల పరిచయ వేదిక జిల్లా టిడిపి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మహేష్ మీడియాతో మాట్లాడుతూ తన విద్యాభ్యాసం అంతా కర్ణాటకలో జరిగిందన్నారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌తో నాకు అనుబంధం ఉందన్నారు. ఏలూరు ఎంపీ స్థానాన్ని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తనకు ప్రకటించారని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో పోలవరం కాలువ ప్రధాన సమస్యన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా తన దృష్టిలో ఉందని తెలిపారు. ఏలూరులో తాగునీటి సమస్య ఉందని, పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని మహేష్ యాదవ్ అన్నారు. తనను కూడా స్థానికుడిగా ఆదరించి ఏలూరు ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల సమస్యలపై అభ్యర్థుల్లో నెలకొన్న పరిస్థితి చక్కదిద్ది అందరిని కలుపుకుని పార్టీని గెలిపించుకుంటానని మహేష్ యాదవ్ తెలియజేశారు. ఈ పరిచయ వేదికలో చింతమనేని ప్రభాకర్, సొంగ రోషన్ కుమార్, బడేటి చంటి, గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.




మహేష్ పరిచయ వేదికలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

నేడు జిల్లాలో భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో ఈనెల 26న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటించనున్నట్టు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మేఘాలదేవి తెలిపారు. మంగళవారం నుంచి నాలుగు రోజులు పాటు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆమె పర్యటన కొనసా గనుంది. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో మనస్తా పానికి గురై మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించనున్నారు. 26న రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకొని నరసాపురం, ఏలూరు, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. 26న పోలవరం, కొయ్యలగూడెం, కన్నయగూడెం మండలాల్లో పర్యటించి దిర్శొం వెంకటలక్ష్మి, యార్రంపేట చంద్ర కన్నయ, బయ్యనగూడెం మర్గని వెంకటేశుల కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. 27న పోలవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, గన్నవరం నియోజకవర్గాల్లో, 28న నూజివీడు, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో, 29న మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని తెలిపారు.




రేచర్ల గ్రామంలో విజయరాజు

ప్రతిఒక్కరూ మంచి మార్గంలో నడవాలి

వైసిపి నియోజకవర్గ అభ్యర్థి విజయరాజు


ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడవాలని, తోటి వారితో కలిసిమెలిసి ఉండాలని చింతలపూడి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో శ్రీకృష్ణుడు కళ్యాణంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ సుధాకర్, గ్రామ దేవాలయ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డి గణపవరం ఉత్సవాల్లో ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రెడ్డి గణపవరం గ్రామంలో వెంచేసివున్న కనకదుర్గమ్మ ఉత్సవ వేడుక కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, వైసిపి అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆలయ కమిటీ అమ్మవారికి ఉత్సవ ఏర్పాట్లు చేపట్టారని, ఉత్సవ కార్యక్రమంలో వేదపండితులతో కలిసి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అల్లూరి రత్నాజి, ఎంపిటిసి అల్లూరి రామ్మోహన్ రావు, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, జెసిఎస్ కన్వీనర్స్, సచివాలయ కన్వీనర్స్, గృహసారథులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ అప్పారావు

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ఓగిరాల తండాకు చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు సోమవారం ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రేస్ తీర్థం పుచ్చుకున్న సృజన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్రంలో ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో చేరికల జోరు కొనసాగుతోంది. పోలవరం నియోజకవర్గంలో వైసిపికి రాజీనామ చేసి కీలక మహిళా నేత దువ్వెల సృజన కాంగ్రెస్‌లో చేరారు. ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దువ్వెల సృజన పోలవరం నియోజకవర్గంలో 2019 ఎన్నికలలో జనసేన తరుపున ఎంఎల్ఎ సీటు కోసం ప్రయత్నం చేసి సీటు రాకపోవడంతో వైసిపిలో చేరి ఎస్‌టి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా క్రియాశీలకంగా పని చేశారు. కరోనా కష్ట కాలంలో మారుమూల గిరిజన గ్రామాలు కొండారెడ్డి గ్రామాల్లో తిరుగుతూ కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు. అంతేకాకుండా తన సొంత ఖర్చులతో పోలవరం నియోజకవర్గంలో కొన్ని గిరిజన గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్ళి పరిష్కారం దిశగా కృషి చేశారు. ఈమె 2024 సార్వత్రిక ఎన్నికలలో పోలవరం వైసిపి అభ్యర్థిగా ప్రయత్నాలు చేసి సీటు దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో షర్మిల సమక్షంలో చేరారు.



జెండా దిమ్మకు రంగు మార్పు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలోని కొత్త ఈదరులో జెండా దిమ్మ తెలుపు రంగు వేయకపోవడంపై వచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. సంబంధిత జెండా దిమ్మకు తెల్ల సున్నం వేయించినట్లు ఎంపిడిఒ పి.శ్యాములు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

నేరాలు - ఘోరాలు

నాచుగుంట చెరువులో వడ్రంగి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నాచుగుంట గ్రామ పరిధిలోని కోటవాని చెరువులో మృతదేహన్ని చేబ్రోలు పోలీసులు సోమవారం గుర్తించారు. నిడమర్రు మండలం చిననింద్రకొలనుకి చెందిన సాయి రమేష్ గత కొంత కాలంగా ఉంగుటూరు మండలం సీతారాంపురంలో ఉంటూ వడ్రంగి వృత్తితో జీవిస్తున్నాడు. ఇటీవల అతనికి ప్రేమ వివాహమైంది. ఈ క్రమంలో చెరువులో తేలుతూ ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేశామని ఎస్ఐ మనికుమార్ పేర్కొన్నారు. పోస్టుమార్టం కోసం బాడీని ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కారు ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పెదవేగి మండలం వేగివాడ గ్రామంలో చోటుచేసుకుంది. కారు ఢీ కొని ఎంవిబి.సత్యనారాయణ(45) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యకు చెందిన కారు ఢీకొంది. పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో వేగివాడ జంగారెడ్డిగూడెం రోడ్డుపై కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు.

మద్యం విక్రేతలపై కఠిన చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా మద్యం అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. వివరాల్లోకి వెళ్లగా మండలంలోని 16 గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మినా, కొన్నా వారిపై కుడా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం రాత్రి మండలంలోని చింతలవల్లి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి దగ్గర నుంచి 5 మద్యం సీసాలు పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సోమవారం మండల కేంద్రమైన ముసునూరులో ఇంటి వద్ద 5 అక్రమ మద్యం సీసాలు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆ మద్యం సీసాలను పట్టుకుని అతనిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యం

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - కామవరపుకోట

వీరిశెట్టిగూడెం గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకి గురి చేస్తున్నాయి. రోడ్డు మీద వెళ్లాలి అంటేనే ప్రజలు భయపడిపోవాల్సి వస్తుంది. వీటి బెడద వల్ల చిన్న పిల్లలు స్కూల్స్‌కి వెళ్లి వచ్చేటప్పుడు వెంటపడుతూ వారిని హడలెత్తిస్తున్నాయి. వాహనాల మీద ప్రయాణం చేసే వారికి దారి లేకుండా రోడ్ల మీద అడ్డంగా పడుకుంటున్నాయి. వీటి వల్ల వాహనదారులు క్రిందపడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల కాలంలో వీటి బెడద ఎంత ఎక్కువ అయ్యింది అంటే కనీసం రాత్రి సమయంలో ప్రజలని సరిగా నిద్రపోనివ్వడం లేదు. రాత్రుళ్లు విపరీతంగా మొరగడం, వాటిని బెదిరించి అక్కడ నుంచి పంపడానికి వచ్చిన వారి మీదకి దాడికి ప్రయత్నం చేయడం జరుగుతుంది. వీటి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఊళ్లో ఉన్న కోళ్లను, పంట పొలాల్లో పశువులపై సైతం ఇవి దాడికి దిగుతున్నాయి. అధికారులు దయ ఉంచి వీధి శునకాల నుంచి తమని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గ్రామంలో సంచరిస్తున్న కుక్కలు


రంగులు మార్చినఅనంతరం ప్రభుత్వాసుపత్రి

నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి రంగు మార్పు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి రాజకీయ పార్టీలకు పోలిన రంగులను తొలగించి, తెలుపు రంగులు వేయడం జరిగిందని నూజివీడు ఆర్‌డిఒ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవానీ శంకరి సోమవారం తెలిపారు. నూజివీడు బైపాస్ రోడ్‌లో శిలాఫలకంపై ప్రజాప్రతినిధుల ఫోటోలను గతంలోనే మూసివేయడం జరిగిందని ఆర్‌డిఒ తెలియజేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి నియమ నిబంధనలు పాటించాలని ఆమె కోరారు.

బాలరాజు విజయానికి సహకారం అందించాలి : జనసేన

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు విజయానికి సహకారం అందించాలని మండల జనసేన అధ్యక్షులు అడపా నాగరాజు కోరారు. మండలంలోని శ్రీరామవరం గ్రామంలోని ఆయన ఇంటి వద్ద సోమవారం జనసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, టిడిపి, బిజెపిల పొత్తులో భాగంగా పోలవరం నియోజకవర్గం సీటు జనసేనకి కేటాయించినట్లు తెలిపారు. టిడిపి, బిజెపి నాయకులను కలిసి మద్దతు కోరడంతో పాటు ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యకర్తలందరూ కూటమి అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూనెం ఆదిత్య, జట్ల రాంబాబు, మధ్యాహ్నపు చిన పెంటారావు, చింతలపూడి నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత అభినందనీయం

సినీ హీరో సుమన్ తల్వార్

ప్రజాశక్తి - దెందులూరు

విద్యార్థులు విద్యతో పాటు చిన్ననాటి నుంచి తనకిచ్చిన పాకెట్ మనీతో వికలాంగులకు ఆర్థిక సహాయం, సేవా కార్యక్రమాలు, పేదలకు చేయూత అందించాలనే మంచి ఆలోచన రావడం అభినందనీయమని ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ అన్నారు. గుండుగొలను శివారు సింగవరం పరిధిలోని శ్రీవిద్యాలయ పాఠశాలలో శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవాసమితి ఛైర్మన్ దాట్ల సీతారామరాజు ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ గేదెల సురేష్ పాఠశాల ఆవరణలో ప్రముఖులు చప్పిడి సత్యనారాయణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సినిమా ఇండస్ట్రీ అధ్యక్షులు కాకర్ల శ్రీను, ప్రముఖ డైరెక్టర్ తోట రవి ఆధ్వర్యంలో విద్యార్థులు పొదుపు చేసిన రూ.3 లక్షల నగదును సినీ హీరో సుమన్ తల్వార్ చేతులు మీదుగా వికలాంగులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీవిద్యాలయ పాఠశాల విద్యార్థులు కరాటే, పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారికి సుమన్ తల్వార్ చేతుల మీదుగా పండ్లు, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం సుమన్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సుమన్ తల్వార్ అందించిన సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్యామలరాజు, సినిమా హీరో, స్నేహితుడు పాతూరుకు చెందిన చప్పిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలు గ్రామాభివృద్ధికి సహకరించాలి

బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు నాగరాజు నాయక్

ప్రజాశక్తి - టి.నరసాపురం

చదువుకున్న మహిళలు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర వహించాలని, తమకున్న చైతన్యాన్ని గ్రామంలోని యువకులకు అందించి చైతన్య పథంలో నడపాలని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ అన్నారు. బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన వివిధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 15 మంది మహిళలకు క్రాంతి భాయి పురస్కారాలు అందజేశారు. ముందుగా హనుమాన్ జెండాను మాజీ సర్పంచి జరభల పున్నయ్య, కమిటీ సర్పంచి చందా నాయక్ ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ హోలీ అనేది ఏడు రంగుల పండుగ మాత్రమే కాదు, చెడుపైన మంచి విజయం సాధించాలని, జీవితంలో కష్టాలను ఎదుర్కొని జీవితాన్ని సప్తవర్ణాల మయం చేసుకోవాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. విద్య, వైద్య, ఆరోగ్య, రక్షణా, సేవా రంగాల్లో పనిచేస్తున్న బోడా విమలావతి, జరభల నాగమణి, భూక్యా కుమారి, భూక్యా సౌజన్య, భూక్యా అరుణ, ధారావత్ దుర్గమ్మ, రాములమ్మ, జరభల పార్వతి, కృష్ణలీల మొదలగు 15 మంది స్త్రీ మూర్తులకు క్రాంతి భాయి పురస్కారాన్ని అందజేశారు. నెహ్రూ నాయక్, చంటి బాబు, నాగమణి ప్రసంగించారు. భూక్యా శ్రీఅక్షర, హిమజ చేసిన బంజారా హోలీ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బిగనాథం నాయక్, మురళీ నాయక్, బాబురావు నాయక్, గాంధీ నాయక్, కృష్ణ నాయక్, రమేష్ బాబు, స్వామి, సత్యం పాల్గొన్నారు.



మహిళలకు పురస్కారాలు అందజేస్తున్న నాగరాజు

పేదవారు చనిపోతే నా దృష్టికి తీసుకురండి

రెయిన్‌బో కంపెనీ ఎమ్‌డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రగడవరం పంచాయతీలో ఎవరైనా పేదవారు చనిపోతే నా దృష్టికి తీసుకు రమ్మని రెయిన్‌బో కంపెనీ ఎమ్‌డీ తాళ్లూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. నా గ్రామం నా సాయం క్రింద ప్రగడవరం పంచాయతీలో జార్జిపేటలోని గాది లీలమ్మ అనారోగ్య కారణంగా మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పి, ఆ కుటుంబానికి తాళ్లూరి శ్రీనివాస్ రెడ్డి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా గ్రామం నా సాయం కార్యక్రమం తన కష్టార్జితం నుంచి సొంత గ్రామానికి తన వంతు సాయం చేయటం ద్వారా సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న మహిళలతో మాట్లాడుతూ మన గ్రామాలు, మన కుటుంబాలు బాగుపడాలి అంటే పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్ము తిరుపతిరావు, మానేపల్లి రాజారావు, ఇశ్రాయేలు, వెంకట్రావు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న శ్రీనివాసరెడ్డి

పలుచోట్ల హోలీ సంబరాలు


టి.నరసాపురం: రంగులు చల్లుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

భారతదేశంలో అన్ని సమాజాలను కలిపి కుల, మత, వర్గ భేదాలు లేకుండా ఇంద్రధనుస్సుగా ఏకం చేసే పండుగ హోలీ అని విజన్ యుపి స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు పాఠశాలల విద్యార్థులు, యువతీ యువకులతో హోలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులు రంగులు, రంగునీళ్లు ఒకరిపై ఒకరు చిమ్ముకుంటూ, పోసుకుంటూ పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హోలీక అనే రాక్షసి చనిపోయిన సందర్భంగా ప్రజలంతా ఆనందంగా రంగులు పూసుకుంటూ ఈ పండుగను జరుపుకుంటారని అన్నారు. అప్పటి నుంచి ఈ సాంప్రదాయాన్ని దేశమంతటా కొనసాగిస్తున్నారన్నారు. మానవ జీవితంలో కష్టాలన్నీ పోయి సుఖసంతోషాలతో రంగులమయం కావాలనే ప్రతీకగా ఆనందోత్సాహాలతో రంగులు పూసుకోవటం జరుగుతుందని తెలిపారు. కొన్నిచోట్ల వసంత ఋతువుకు ఆరంభ సూచికగా ఈ పండుగను జరుపుకుంటారన్నారు. ఈ పండుగ రోజున ప్రతిఒక్కరూ సహజమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కృత్రిమ రంగులతో చర్మ వ్యాధులు కారణమౌతాయని కాబట్టి వాటికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కొలుసు పార్థసారథి మండలంలోని సిద్ధార్థ నగర్ గ్రామంలో సోమవారం ఆనందోత్సాహాల మధ్య హోలీ పండుగ జరుపుకున్నారు. గిరిజన తెగ అయిన(సుగాలి) యువతీ యువకులతో కలిసి రంగులు పూసుకుంటూ సాంప్రదాయ నృత్యాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన హక్కులను పరిరక్షిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నూజివీడు రూరల్: హోలీ వేడుకల్లో పార్థసారథి


టి.నరసాపురం: రంగులు చల్లుకుంటున్న విద్యార్థులు

దెందులూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా రంగురంగులతో రంగుల చిమ్ముకుని హోలీ పండుగను ఎంతో సంతోషంగా యువత, విద్యార్థులు, బాలికల కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులతోనూ హోలీ వేడుకలు జరిపారు.

కీర్తిశేషుల ఫొటోలు తొలగించనవసరం లేదు

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి

ఏలూరు: ఎన్నికల నియమావళి ప్రకారం కీర్తిశేషుల శిలాఫలకాలపై ఉన్న ఫోటోలు, పేర్లను తొలగించవలసిన ఆవశ్యకత లేదని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఇప్పటికే కార్యాలయాల్లో ఉన్న పోస్టర్లను, తదితరులను తొలగించడం జరిగిందని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఎంసిసి బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు.

పెయిడ్ ఆర్టికల్స్‌కు మీడియా దూరంగా ఉండాలి

ఆర్‌డిఒ వై.భవానీ శంకరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పెయిడ్ ఆర్టికల్స్‌కు మీడియా దూరంగా ఉండాలని ఆర్‌డిఒ వై.భవాని శంకరి సూచించారు. ఈ సందర్భంగా సోమవారం నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ ఫలానా వారికి ఓటు వేయండి అనే విధంగా ప్రచురణలు, పెయిడ్ ఆర్టికల్స్‌కు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేని పక్షంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్‌పి లక్ష్మయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ

'పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి'

బుట్టాయిగూడెం: పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు ఎస్.రామ్మోహన్ అన్నారు. రాష్ట్రంలో పార్లమెంటు నియోజవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి, అదనంగా మన్యం జిల్లా కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈ జిల్లాతో మొత్తం 26 జిల్లాలు రాష్ట్రంలో ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేయగా చింతూరు, రంపచోడవరం లాంటి డివిజన్ కేంద్రాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలపడం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే సుమారు 200 కిలోమీటర్ల దూరం కావడం వల్ల ఆదివాసీ గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గంపాడులో కొన్ని గ్రామాలు పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత మండలాలు గతంలో ఖమ్మం జిల్లాలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నవి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఏలూరు జిల్లాలో ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న జీలుగుమిల్లి, టి.నర్సాపురం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాలు జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌లో కొన్ని మండలాలు రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో ఉన్న మండలాలు చింతూరు, కుక్కునూరు డివిజన్లను కలిపి ఆదివాసి జిల్లా ఏర్పాటు చేయాలని రామ్మోహన్ అన్నారు. ఈ మండలాలను విభజించి పోలవరం కేంద్రంగా ఆదివాసి జిల్లాను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు వారి మ్యానిఫెస్టోలో పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేస్తామని, నిర్దిష్ట హామీ ఇవ్వాలని, హామీ ఇచ్చిన పార్టీ అభ్యర్థికి ఆదివాసి ప్రజలంతా కూడా ఓటు వేస్తామని తెలియజేశారు.

సిఎం స్టిక్కర్ల తొలగింపునకు చర్యలు

జంగారెడ్డిగూడెం

మున్సిపల్ కమిషనర్ ఎన్.నరేంద్రకుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోతో కూడిన స్టిక్కర్లతో కూడిన వాహనాలను అదుపు చేయుటకు పోలీసు శాఖ వారిని సంప్రదించినట్లు జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎన్.నరేంద్రకుమార్ తెలిపారు. వారి సహకారంతో సదరు వాహనాలను త్వరితగతిన పట్టుకుని వాటిపైన ఉన్న స్టిక్కర్లను తొలగించి, మరలా స్టిక్కర్లు అంటించకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని మెట్టఉప్పరగూడెం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి మర్లపూడి సులోమాన్(60) గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. మెట్టఉప్పరగూడెంలో ఉపాధి పనులకు సులోమాన్ ఉదయమే వెళ్లాడు. ఉదయం 10.30 గంటల సమయంలో సులోమాన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో సహచర కూలీలు చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుని భార్య రోడ్డు ప్రమాదంలో గతంలో మృతి చెందింది. కరోనా సమయంలో కుమారుడు కూడా మృతి చెందడంతో కోడలు, మనవళ్లకు సులోమాన్ పెద్దదిక్కయ్యాడు.